సందేహాలను నివృత్తి చేయాలి

• అదనపు కలెక్టర్ చిత్రామిత్రా


బోధన్‌లో దరఖాస్తును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చిత్రామిత్రా

బోధన్‌టౌన్/రెంజల్(బోధన్): ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే వారి సందేహాలను నివృత్తి చేయాలని, వారికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్లు చిత్రామిత్రా, యాదిరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం బోధన్ పట్టణంలోని 3, 23 వార్డులతో పాటు రెంజల్ మండలంలోని సాటాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన సభలను చిత్రామిత్రా, రెంజల్ మండలం దూపల్లి, బోర్గాంలో యాదిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ పథకాలు అందుతాయన్నారు. ప్రజలకు ప్రతి పథకం గురించి వివరించాలని, దరఖాస్తు దారులందరికీ రసీదు లు అందజేయాలని అధికారులకు సూచించారు. దరఖాస్తు ఫారాల కొరత లేకుండా చూడాలని, జిరాక్స్ సెంటర్లలో అదనంగా డబ్బులు వసూలు చేయకుండా నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రెంజల్ తహసీల్దార్‌కు సూచించారు. రెంజల్ మండలంలోని దూపల్లి, కళ్యాపూర్, తాడ్‌బిలోలి, బోర్గాం గ్రామాల్లో సర్పంచులు సాయారెడ్డి, కాశం నిరంజన, వెల్మల సునీత, వాణి ఆధ్వర్యంలో ప్రజాపాలన సభలను నిర్వహించారు. బోధన్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఈ శివానందం, కౌన్సిలర్లు మీర్ నజీర్‌అలీ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

సాక్షి నెట్‌వర్క్ : ఆరు గ్యారంటీల అమలుకోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కొనసాగుతున్నది. నాలుగో రోజైన మంగళవారం అధికారులు ప్రత్యేక సభలు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయడంతోపాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. ఉన్నతాధికారులు ప్రజాపాలన సభల నిర్వహణ తీరును పర్యవేక్షించారు.


వర్ని మండలం సైదిమల్‌లో..


డొంకేశ్వర్ మండలం అన్నారంలో..


బాల్కొండలో దరఖాస్తును స్వీకరిస్తున్న అధికారులు


వేల్పూర్ మండలం కోమన్‌పల్లిలో..


మాక్లూర్ మండలం చిన్నాపూర్‌లో..


రుద్రూర్ మండలం సిద్ధాపూర్‌లో..


జానకంపేటలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి

ఆస్పత్రిలో సదుపాయాలపై సమీక్ష

నవీపేట : మండల కేంద్రంలోని సీహెచ్‌సీ అభివృద్ధి సొసైటీ(హెచ్‌డీఎస్) సమావేశాన్ని చైర్మన్, ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన హాజరుకాగా, ఆస్పత్రిలో కల్పించిన మౌళిక సదుపాయాలపై చర్చించారు. ఆస్పత్రి స్థలం కబ్జాకు గురవడంతో ఫెన్సింగ్ వైరుతో హద్దులు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. రోగులకు అవసరమైన మందులతోపాటు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తీర్మానించారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి రాథోడ్ తుకారాం, మెడికల్ ఆఫీసర్ కావ్య, ఎంపీటీసీలు మైస రాధ, డాంకె సతీశ్, మీన, వార్డు సభ్యుడు నవీన్‌రాజ్, సీహెచ్‌సీ సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు, సూపర్‌వైజర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.


హెచ్‌డీఎస్ సమావేశంలో చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

శ్రీవారి ఆలయంలో ప్రవచనాలు

నిజామాబాద్ సిటీ: నగరంలోని ఆర్యనగర్ లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఉపన్యాస, భజన, ప్రవచనాలు ప్రారంభించారు. పరిషత్ ప్రతినిధి సీతారామచంద్ర స్వామి ఉపన్యాస, భజన, ప్రవచనాలు వినిపించారు. ఈ కార్యక్రమాలు ఈ నెలా 6 వరకు (ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు) కొనసాగుతాయని తెలిపారు.



క్రిస్మస్ టోర్నీ విజేత మల్లారం

మాక్లూర్: మండలంలోని మెట్టులో వారం రోజుల పాటు కొనసాగిన క్రిస్మస్ ఫెస్టివల్ టోర్నమెంట్ కప్‌ను నిజామాబాద్ మండలం మల్లారం గ్రామానికి చెందిన యువకులు కై వసం చేసుకున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి మొత్తం 16 కబడ్డీ టీములు పాల్గొనగా, మల్లారం జట్టు విన్నర్‌గా నిలిచింది. టోర్నీ నిర్వాహకులు విన్నర్‌గా నిలిచిన మల్లారం జట్టు సభ్యులకు మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కప్‌ను అందజేసి సన్మానించారు. ఖోఖో, క్యారం, త్రోబాల్, ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సైతం పాస్టర్ రూబేన్, డాక్టర్ ఇమ్మానుయేల్, సాల్మన్‌రాజ్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి యాకోబు, చరణ్, ప్రభుదాసు, వినయ్ సాగర్, యూత్ సభ్యులు లినేకర్, ప్రశాంత్, ప్రసాద్, అనీల్ పాల్గొన్నారు.


కప్ అందుకుంటున్న కబడ్డీ క్రీడాకారులు

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడలో హైమాస్ట్ లైట్లను జెడ్పీటీసీ రాకేశ్‌చంద్ర మంగళవారం ప్రారంభించారు. స్థానిక ప్రైమరీ స్కూల్, మార్కెట్‌యార్డు, పెద్దమ్మ ఆలయం, గొల్లకంత వద్ద హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏనుగు గంగారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఏలేటి రమేశ్, ఎంపీటీసీలు నోముల గంగారెడ్డి, గుడాల గంగాధర్, బొండ్ల భూమన్న, జానా ముత్యం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



కమ్మర్‌పల్లి: ఉపాధ్యాయుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీఆర్టీయూటీఎస్ పనిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసిన ఆయూబ్ అహ్మద్ గత నెలలో గుండెపోటుతో మరణించగా, పీఆర్టీయూ రాష్ట్ర శాఖ నిర్ణయం మేరకు రూ.లక్ష బీమా సొమ్మును బాధిత కుటుంబానికి చౌట్‌పల్లిలో మంగళవారం అందజేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇల్లెపు శంకర్, నిజామాబాద్ డివిజన్ ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డి, ఆర్మూర్ డివిజన్ ఇన్‌చార్జి లక్ష్మణ్‌పటేల్, జిల్లా సమాచార కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కమ్మర్‌పల్లి, వేల్పూర్, భీమ్‌గల్, మోర్తాడ్ మండలాల అధ్యక్షులు పొద్దుటూరి చంద్రశేఖర్, అంకం నరేశ్, మగ్గిడి ప్రవీణ్, మేకల వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

7న పూలే విగ్రహావిష్కరణ

నిజామాబాద్‌రూరల్: మండలంలోని జాలాల్‌పూర్‌లో విప్లవోద్యమకారుడు జ్యోతి రావు పూలే, మన్యవార్ కాన్షీరామ్ విగ్రహాలను ఈ నెల 7న ఆవిష్కరించనున్నట్లు అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు తెలిపారు. గ్రామంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

శివారు కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలి

• ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలోని శివారు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు కాలనీలవాసులకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ పార్కుతోపాటు సమీపంలోని కాలనీలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలవాసులతో స్థానిక సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా, వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, బీజేపీ నాయకులు యామాద్రి భాస్కర్‌పటేల్ తదితరులున్నారు.


కబడ్డీ క్రీడాకారిణి అదితిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మినీస్టేడియంలో జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారిణి అదిని ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి సన్మానించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆయన అన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గంగాధర్, పీడీ రాజ్ కుమార్, పేటా జనరల్ సెక్రెటరీ మల్లేశ్‌గౌడ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు కృషి చేస్తా

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని తట్టికోట్‌కాలనీ పద్మశాలీ సంఘ భవనంపై కళ్యాణ మండప నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి అన్నారు. సంఘ భవనంలో మంగళవారం ఆమె నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు కళ్యాణమండప నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరగా, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్తానని ఆమె అన్నారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్, కౌన్సిలర్లు శ్రీకాంత్, సత్యం, పద్మ శాలీ సంఘం అధ్యక్షుడు గంగుల దేవీదాస్, ప్రధాన కార్యదర్శి గుర్రం సంతోష్, ప్రతినిధులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి

ఉద్యమకారులు ఏకం కావాలి

రుద్రూర్: మలిదశ తెలంగాణ ఉద్యమకారులు హక్కుల సాధన కోసం ఏకం కావాలని తెలంగాణ ఉద్యమకారుడు తీగుల్ల రాజావరప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని అక్బర్‌నగర్‌లో మంగళవారం ఉమ్మడి వర్ని మండల మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన గ్రామసభల్లో దరఖా స్తులు స్వీకరించనున్నందున ఉద్యమ ఫలాలు అందుకునేందుకు కలిసి రావాలన్నారు. తెలంగాణ ఉద్యమ కేసుల వివరాలను పోలీస్‌స్టేషన్ నుంచి సేకరించి దరఖాస్తుకు జతచేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమానికి వెళ్లి ఉద్యమకారుల వాణిని వినిపించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కులకర్ణి సంతోష్, అల్లావుద్దీన్, లాల్ మహమ్మద్, నాగనాథ్, జాకోరా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉద్యమకారుడు ప్రసాద్

విగ్రహప్రతిష్ఠాపన

రుద్రూర్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఓట్లపు ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదబ్రాహ్మణుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.



అయోధ్య అక్షింతల శోభాయాత్ర



రెంజల్(బోధన్): మండలంలోని వీరన్నగుట్ట లో మంగళవారం అయోధ శ్రీరాములవారి అక్షింతల శోభాయాత్రను నిర్వహించారు. స్థానిక రామాలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ బైండ్ల రాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు శిరవేణి శంకర్, గుంజే గంగాధర్, రాజనర్సు, రాజేందర్, అవినాష్‌గౌడ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

తాటిపల్లిలో..

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామంలో అయోధ్య రాముల వారి అక్షింతల శోభాయాత్రను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేశారు. మహిళలు శోభాయాత్రకు మంగళహారతులతో స్వాగతం పలికారు. సర్పంచ్ మాలోతు తిరుపతి, ఉపసర్పంచ్ సంతోష్ పాల్గొన్నారు.

నగరంలో అక్షింతల పంపిణీ

నిజామాబాద్ సిటీ: నాడు అయోధ్య కరసేవలో పాల్గొన్న ఎల్లమ్మ గుట్ట వాసి న్యాలం ఆనంద్‌కు బీజేపీ నాయకులు అయోధ్య అక్షింతలను అందజేశారు. ఆనంద్ మాట్లాడుతూ.. అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం జరిగిన కరసేవలో ఎల్లమ్మ గుట్ట నుంచి అయోధ్యకు వెళ్లినట్లు తెలిపారు. ఆ రోజుల్లో ఎన్నో ఇబ్బందులు, హింస చెలరేగినప్పటికీ అయోధ్యలో రామ మందిరం నిర్మాణమే ధ్యేయంగా కరసేవకు వెళ్లినట్లు తెలిపారు. ఇన్నేళ్లకు కళ నిజమవుతున్న సందర్భంగా తన గుండె ఆనందంతో ఉప్పొంగుతోందని పేర్కొన్నారు.

చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయండి

తెయూ(డిచ్‌పల్లి): దేశంలో విద్యారంగ పరిరక్షణ కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఈ నెల 12న నిర్వహించనున్న చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ యూనివర్సిటీ ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. పాఠ్య పుస్తకాల్లో మతోన్మాద భావజాలాన్ని జొప్పిస్తూ విద్యారంగాన్ని కాషాయీకరిస్తోందని ఆరోపించారు. చలో పార్లమెంట్ కార్యక్రమానికి తెయూ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. నాయకులు దినేష్, చిత్రు, సభ్యులు నవీన్, అశోక్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – బద్మాష్ గాళ్లకు..(తెలుగు) -12.25
హాయ్‌నాన్న(తెలుగు)- 3.15
ఉమాపతి(తెలుగు)- 7.00, డంకీ (హిందీ)- 10.30
స్క్రీన్-2 – సలార్ (తెలుగు)- 11.00, 2.35, 6.10, 9.45
స్క్రీన్-3 – డెవిల్(తెలుగు) - 12.00, 3.10, 6.20, 9.30
స్క్రీన్-4 – సలార్ (తెలుగు) - 12.15, బాబుల్‌గమ్ - 3.50, 7.00
సలార్ (తెలుగు) : 10:10

క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరికలు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఆర్మూర్ చేనేత సహకార సంఘం మాజీ డైరెక్టర్ చెన్నరవికుమార్ మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. పెర్కిట్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, విట్టవం జీవన్, శెట్‌పల్లి నారాయణ, మల్కన్న, ఎస్‌కే బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు అన్ని సౌకర్యాలు



బాల్కొండ: బ్యాంకులో కస్టమర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్లు ఎస్‌బీఐ బ్యాంకు చీఫ్ మేనేజర్ రాజేశ్‌కుమార్ అన్నారు. కస్టమర్ల సౌకర్యార్థం కిసాన్‌నగర్‌లో పునరుద్ధరించిన ఎస్‌బీఐ బ్రాంచి భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత భవనంలో సుమారు 60 ఏళ్ల నుంచి కిసాన్‌నగర్ బ్రాంచి లాభాలతో నడుస్తున్నదన్నారు. కస్టమర్లకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సుమారు రూ.కోటి వెచ్చించినట్లు తెలిపారు. బ్యాంకు సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మేనేజర్ సూర్యక్రాంతిరావు, రీజినల్ మేనేజర్ మన్యం శ్రీకాంత్, బ్రాంచ్ మేనేజర్ రాజేశ్, వేంపల్లి సహకారసంఘం చైర్మన్ జక్క రాజేశ్వర్, జెడ్పీటీసీ దాసరి లావణ్య , ప్రముఖ వైద్యుడు ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ



కమ్మర్‌పల్లి: వాలీబాల్ క్రీడాకారులకు మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి హారిక మంగళవారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు ఫారాలు రాలేదు

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి దరఖాస్తు ఫారాలు రాలేదని డొంకేశ్వర్ మండల తహసీల్దార్ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిరాక్స్ కేంద్రాల్లో లభించే దరఖా స్తు ఫారాలు చెల్లవని, అయితే రేషన్ కార్డు అవసరం ఉన్న వారు తెల్ల కాగితంపై దరఖాస్తును అందజేస్తే సరిపోతుందని, ఎలాంటి అనుమానాలకు తావివ్వొద్దని ఆయన సూచించారు.

రాజ్యాంగ విలువలపై అవగాహన ఉండాలి



ఆర్మూర్‌టౌన్: ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలపై అవగాహన కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు అన్నారు. పట్టణంలోని విద్యా హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో 'రాజ్యాంగ విలువలు వాటి రక్షణ'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన నర్రా రామారావు మాట్లాడుతూ.. సమాజంలో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు గోపీకృష్ణ, కార్యదర్శి పట్వారి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, ప్రాజెక్ట్ చైర్మన్ ప్రవీణ్‌పవార్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు నర్సింలు, ప్రమోద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

కోటగిరి (రుద్రూర్): నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సాదుల రాములును హత్య చేసిన నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోటగిరి ఎంపీటీసీ కొట్టం మనోహర్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో నాయకులతో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ కోసం ఎంతో శ్రమించిన రాములు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షాహిద్, మాజీ ఎంపీపీ గంగాధర్‌రావుదేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ కోసం పరుగులు

ఆర్మూర్ టౌన్/బోధన్ టౌన్/వర్ని/ఎడపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన న్యాయ సంహిత చట్టంలోని నిబంధనలకు వ్యతిరేకంగా ట్యాంకర్ల యజమానులు, ట్రక్కుల డ్రైవర్లు సమ్మె చేపట్టనున్నారని సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో వాహనదారులు పెట్రోల్ బంక్‌లకు పరుగులు తీశారు. పెట్రోల్, డీజిల్ కోసం బారులు తీరారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పెట్రోల్‌బంక్‌లు కిటకిటలాడాయి. ఒక్కో బంక్‌లో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. వాహనాల ట్యాంక్‌లను ఫుల్ చేయించుకోవడంతోపాటు క్యాన్‌లు, బాటిళ్లలో పెట్రోల్, డీజిల్‌ను తీసుకెళ్లారు. పలుచోట్ల వాహనదారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.


వర్నిలోని పెట్రోల్‌బంక్‌లో బారులు తీరిన ద్విచక్రవాహనదారులు


ఎడపల్లి మండలం జానకంపేట పెట్రోల్‌బంక్‌లో..


ఆర్మూర్‌లోని పెట్రోల్‌బంక్‌లో వాహనదారులు


ఆర్మూర్‌లోని పెట్రోల్‌బంక్‌లో కార్లు, ఆటోలు